క్లుప్తంగా

పేపర్ ఆర్ట్‌పై శిక్షణ



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లలు గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం పేపర్ పెయింటింగ్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. వారిలో సృజనాత్మక కళలను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 30 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫెవికాల్ కంపెనీ ప్రతినిధి జి.శిరీష లత రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. పెయింటింగ్‌లో మెలకువలను నేర్పించారు. ఉపాధ్యాయుడు ఎం.శంకరరావు మాస్టర్, రైల్వే డివిజన్ లోకో పైలట్ జామి అన్నాజీరావు, గ్రంథాలయ అధికారి వై.పద్మజ పాల్గొన్నారు.

కొండవాలులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు లక్ష్మీనారాయణపురం-1, లక్ష్మీనారాయణపురం కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు బుధవారం డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ శంకుస్థాపన చేశారు. సుమారు రూ.57 లక్షలతో పనులు చేపట్టనున్నట్లు జోన్-5 ఈఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. రూ.38 లక్షలతో రోడ్లు, డ్రైనేజీలు, రూ.19 లక్షలతో గెడ్డ రక్షణ గోడ నిర్మాణ పనులకు నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించినట్లు సతీష్ తెలిపారు. కార్యక్రమంలో డీఈ భరణికుమార్, ఏఈ అర్చన, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా రామలింగేశ్వరుడి వార్షిక కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న దంపతులు

సీతంపేట: శంకరమఠం రోడ్‌లోని దేవదాయ శాఖ పరిధిలోని రామలింగేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయంలో జరిగిన ఈ వేడుకలో సుమారు 250 మంది దంపతులు పాల్గొని తరించారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ముందుగా మేళతాళాలతో స్వామి వారి తిరువీధి ఊరేగింపు నిర్వహించారు. కల్యాణం అనంతరం తలంబ్రాలు, తీర్థప్రసాదాలు పంచారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో రెహమాన్‌కు గోల్డ్ మెడల్



రెహమాన్‌ను అభినందిస్తున్న మధుకుమార్

సీతంపేట: ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో లంకపల్లి బుల్లయ్య కళాశాలలో బీఏ చదువుతున్న విద్యార్థి షేక్ ముజీబ్ రెహమాన్ బంగారు పతకం సాధించాడు. 67-71 కిలోల విభాగంలో మెడల్ కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా బుధవారం కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ రెహమాన్‌ను అభినందించారు.

శభాష్

- టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు
- 78 శాతం ఉత్తీర్ణతతో రెండో స్థానంలో మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్
- సగం మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత



ఉత్తమ మార్కులు సాధించిన టెన్త్ విద్యార్థులతో స్కూల్ హెచ్ఎం శాంతికుమారి

సీతంపేట: పక్కా ప్రణాళికతో చదివారు.. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. వంద రోజుల ప్రణాళికను పూర్తి స్థాయిలో అమలు చేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. బాగా చదువుతున్న విద్యార్థులు ఇంకా మెరుగైన మార్కుల సాధనకు ఉపాధ్యాయులంతా సమష్టిగా కృషి చేశారు. తత్ఫలితంగా సీతంపేట మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ టెన్త్ విద్యార్థులు మంచి మార్కులు సాధించి శభాష్ అనిపించుకున్నారు. ఈ హైస్కూల్ 78 శాతం ఉత్తీర్ణత సాధించి జీవీఎంసీ పాఠశాలల్లో రెండో స్థానంలో నిలిచింది. గతేడాది 74.39 శాతం సాధించగా.. ఈ ఏడాది మరో 3.61 శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించడం విశేషం. పాఠశాల నుంచి 86 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. 67 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 42 మంది ప్రథమ, 16 మంది ద్వితీయ, 9 మంది తృతీయ శ్రేణుల్లో పాసయ్యారు.

10 మందికి 500కు పైగా మార్కులు

ఈ ఏడాది పదో తరగతి పరీక్షల ఫలితాల్లో 10 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు.



తల్లిదండ్రులతో మధురానగర్ హైస్కూల్ టాపర్ ఎన్.భోగేష్

ఎన్. భోగేష్ 556 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచాడు. ఐ.స్పందన 549 మార్కులతో ద్వితీయ, కె.రోషిణి, పి.గాయత్రి 527 మార్కులతో తృతీయ స్థానాల్లోలో నిలిచారు. జె.హర్షిత దీప్తి 524, టి.వేద శ్రీనిధి 519, ఎం.జ్యోత్స్న 518, పి.సుమంతి 517, వి.ధనలక్ష్మి 517, ఎ.రాజేష్ 511, పి.కృష్ణ ప్రవళిక 508 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను స్కూల్ హెచ్ఎం శాంతికుమారి ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు.

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో సాధించా..

ఉపాధ్యాయుల గైడెన్స్‌లో ప్రతి రోజూ ఉదయం 7.30 నుంచి సాయంత్రం గంటల వరకు స్కూల్‌లో చదివాను. ఇంటికి వెళ్లాక కూడా రాత్రి 11 వరకు చదివేవాడిని. మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో మంచి మార్కులు వచ్చేలా ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చి ప్రోత్సహించారు. పాలిసెట్ రాశాను, ట్రిపుల్ ఐటీఐ సీటు కోసం పరీక్షకు ప్రిపేర్ అవుతున్నాను.

-ఎన్.భోగేష్, మధురానగర్ హైస్కూల్

టెస్ట్ బుక్స్ క్షుణ్ణంగా చదివా..



ఉపాధ్యాయులు చెప్పినట్టే ప్రతి సబ్జెక్టు టెస్ట్ బుక్‌ను క్షుణ్ణంగా చదవాలని చెప్పారు. పరీక్షల్లో కూడా టెస్ట్ బుక్ నుంచే ఎక్కువగా ప్రశ్నలు వచ్చాయి. రాత్రి 11.30 గంటల వరకు చదివేదాన్ని. హిందీ మార్కులు తగ్గడం వల్ల టోటల్ మార్కులు తగ్గాయి. పాలిసెట్ రాశాను. ఇంటర్‌లో ఎంపీసీ జాయిన్ అవుతాను. ఆపై ఇంజినీరింగ్ చేస్తాను.

- ఐ.స్పందన, మధురానగర్ హైస్కూల్

సమష్టి కృషితో సత్ఫలితాలు

పదో తరగతి పరీక్షలంటే విద్యార్థుల్లో కొంత ఆందోళన, ఒత్తిడి ఉంటాయి. దాని నుంచి బయట పడి ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాసేలా మోటివేషన్ చేశాం. సమ్మెటివ్ మార్కుల ఆధారంగా ఏ, బీ, సీ, డీ గ్రేడ్‌లుగా విభజించాం. ఏ గ్రేడ్ విద్యార్థులు ఏ ప్లస్, బీ గ్రేడ్ విద్యార్థులు ఏ గ్రేడ్ సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ అందించారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థులు పాస్ అయ్యేలా డీసీఈబీ ప్రత్యేక మెటీరియల్‌తో చదివించాం. సమష్టి కృషితో మంచి ఫలితాలు సాధించాం.

- శాంతికుమారి, హెచ్ఎం, జీవీఎంసీ హైస్కూల్, మధురానగర్

సంతోషిమాత కాలనీకి మంచి రోజులు

- 78 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు, విద్యుత్ కనెక్షన్లు
- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 45, 49 వార్డుల్లో గ్రామ సభ



45వ వార్డు గ్రామసభలో మాట్లాడుతున్న కె.కె.రాజు. చిత్రంలో కార్పొరేటర్ హనోకు, అధికారులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి సంతోషిమాత కాలనీలో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్య పరిష్కారమైందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. కాలనీలో బుధవారం కె.కె.రాజు, కార్పొరేటర్ కంపా హనోకుల ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు దశాబ్ద కాలం నుంచి 78 కుటుంబాలు ఈ కాలనీలో నివసిస్తున్నాయని, వీరికి ఇళ్ల పట్టాలు, కరెంట్ కనెక్షన్లు, మౌలిక వసతులు లేవని చెప్పారు. వీటి విషయమై ఎందరో ప్రజాప్రతినిధుల దగ్గరకు కాలనీవాసులు తిరిగిన సమస్య పరిష్కారం కాలేదన్నారు. తాను సమన్వయకర్తగా నియమితుడు కాక ముందు నుంచే ఈ సమస్యను స్థానికులు తన దృష్టికి తెచ్చారని తెలిపారు. అప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి విషయం తెలియజేసి, అధికారులను ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ ఇక్కడ నివసిస్తున్న 78 కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లు, ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి మార్గం సుగమం చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, సీతమ్మధార మండల తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పాపునాయుడు, హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసంగ రాజు, ఏపీడీ, ఏఈ, ఆర్ఐ, సచివాలయ సిబ్బంది, పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, నాయకులు నీలి రవి, సన్యసప్పలనాయుడు, సన్నీ, ఆదిలక్ష్మి, నేపాల్ శ్రీను, స్థానికులు పాల్గొన్నారు.

త్వరలోనే అన్ని సమస్యలకు పరిష్కారం

మర్రిపాలెం: జీవీఎంసీ 49వ వార్డులో పలు సమస్యలకు పరిష్కారాలు చూపేందుకు గ్రామ సభ ఏర్పాటు చేశారు. బర్మాక్యాంప్ కాలనీలో వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు, ప్రభుత్వ అధికారులతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. స్థానికులు పలు సమస్యలను విన్నవించారు. ఏఎస్సార్ నగర్‌లో డీ-బ్లాక్ పెండింగ్ ఉన్న పట్టాలు, రైల్వే సొసైటీలో రోడ్లు, డ్రైనేజీల మరమ్మతులు, హౌసింగ్ పనులు వంటి తదితర పనులను పరిష్కరించాలని కోరారు. ఈ విషయమై అధికారులతో కె.కె.రాజు మాట్లాడి త్వరలోనే సమస్యలను పరిష్కరించేలా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్,, గోపాలపట్నం తహసీల్దార్ జయ, యూసీడీ పీడీ పాపునాయుడు, జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, హౌసింగ్ ఈఈ ప్రసంగరాజు, డీఈ భరణి, ఏపీడీ, ఏఈ, ఆర్ఐ, పార్టీ సీనియర్ నాయకులు నీలి రవి, కర్రి రామారెడ్డి, 49వ వార్డు నాయకులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే పథకాలు, సేవలు



43వ వార్డులో వృద్ధురాలికి కరపత్రం అందిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట: ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు, పౌర సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం 43వ వార్డు అక్కయ్యపాలెం-1 సచివాలయం పరిధిలోని గోశీలపాలెం, మునసబు వారి వీధి ప్రాంతాల్లో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీతో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను వివరించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలపై ముద్రించిన కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో ఏ నాయకుడు చేయనటువంటి విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రజల గడప వద్దకే పథకాలు, సేవలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. అటువంటి ముఖ్యమంత్రి వెంట ప్రజలంతా ఉండాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాయుడు శ్రీను, యువజన విభాగం ఇన్‌చార్జి ఎం.సునీల్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ మెంబర్ అంబటి శైలేష్, షేక్ బాబ్జి, చిన్న, 43వ వార్డు నాయకులు జక్కంపూడి సత్యనారాయణ, బైరా వెంకట్, నేతల కుమార్, ఖాదర్, ఎం.గోపి, చిన్నమ్మ, వీరబాబు, మౌనిక రెడ్డి, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు



ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు సమస్యలు వివరిస్తున్న ఉరిటి ఉమామహేశ్వరరావు

తాటిచెట్లపాలెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉన్నారని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం 45వ వార్డు, భీమిలి నియోజకవర్గ పరిధిలోని కొండవాలు ప్రాంతాల్లో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకుతో కలిసి ఆయన పర్యటించారు. సత్యసాయినగర్, వరాహగిరి కాలనీల్లోని మొత్తం 11 క్లస్టర్లలో కాలనీ వాసులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అందుతున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. మళ్లీ ఈ పథకాలు అంది, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలంటే ఆ దేవుని దీవెనలతోపాటు మీ ఆశీర్వాదాలు ముఖ్యమంత్రి జగన్‌పై ఉండాలని కోరారు.

త్వరలోనే అభివృద్ధి పనుల ప్రారంభం

దేవస్థానం భూ సమస్య, కాలనీలోని రోడ్లు, డ్రైనేజీల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే, కార్పొరేటర్లను విశాఖ నగర ఎస్సీ, బీసీ, ఈబీసీ సంక్షేమ సంఘం సంస్థాపక అధ్యక్షుడు, వరాహగిరి కాలనీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉరిటి ఉమామహేశ్వరరావు, కమిటీ సభ్యులు జి.సత్యారావు, కె.ఎస్.వి.ప్రసాద్ కోరారు. సింహగిరి కాలనీ, సింగాలమ్మపురం, సత్యసాయినగర్, వరాహగిరి కాలనీ-1, 2 మొదలగు కొండవాలు ప్రాంతాల్లో చాలా మంది ఇళ్లు నిర్మించి దశాబ్దాలు అవుతోందని, ఇవి శిథిలావస్థలో చేరి కూలిపోతున్నాయని, వీటి మరమ్మతులకు అనుమతులిప్పించాలని విన్నవించారు. ఈ విషయమై స్పందించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతూ దేవస్థానం భూముల విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్తశుద్ధితో ఉన్నారన్నారు. ఈ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తారని, ఇళ్ల రిపేర్లకు ఒక పరిష్కారం లభిస్తుందని హామీ ఇచ్చారు. రోడ్లు, డ్రైనేజీలకు నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాండురంగ, సిబ్బంది, సీవో జయలక్ష్మి, పోలీసు సిబ్బంది, సచివాలయ అడ్మిన్లు, వెల్ఫేర్ సెక్రటరీలు, వలంటీర్లు, కాలనీ నాయకులు కారుకొండ రాజు, పార్టీ నాయకులు సన్యాసప్పలనాయుడు, నేపాల్ శ్రీను, కారుకొండ రాజు, ఆదిలక్ష్మి, తవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధి 11 కేవీ పీ అండ్ టీ కాలనీ, 11 కేవీ ఎస్ఈ లేఅవుట్, 11 కేవీ బీఎల్ లేఅవుట్, 11 కేవీ ఏపీఎస్ఈబీ, 11 కేవీ వుడా కాంప్లెక్స్ ఫీడర్లలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్-1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు పీ అండ్ టీ కాలనీ, తహసీల్దార్ కార్యాలయ ప్రాంతం, ఎస్ఆర్ఐ హాస్పిటల్ ఏరియా, బాలయ్యశాస్త్రి లేఅవుట్, విజయ రెసిడెన్సీ, టీపీటీ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ

మురళీనగర్: వేసవి ఎండల్లో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మురళీనగర్‌లో మజ్జిగ పంపిణీ చేశారు. పాదచారులు, కూలీలు, పండ్ల వ్యాపారులు, ఆటో డ్రైవర్లకు మజ్జిగ అందజేశారు. సైదా జహాన్ ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శేషామణి, ఎస్.పుష్పలత, కోశాధికారి లక్ష్మి, ఉపాధ్యక్షులు లీలా నాయుడు పాల్గొన్నారు.

గజేంద్ర మోక్షంపై ప్రసంగం



ప్రసంగిస్తున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం జరిగిన సాహిత్య కార్యక్రమంలో శేఖరమంత్రి ప్రభాకర్ గజేంద్ర మోక్షం కథపై ప్రసంగించారు. శరణు కోరిన వారి రక్షణ బాధ్యత భగవానుడే స్వీకరించి కాపాడుతాడన్నది సత్యమని, భాగవతంలోని అష్టమ స్కందంలో పోతన దీని గురించి వివరించాడని తెలిపారు. ప్రతి ఒక్కరూ భాగవతాన్ని పఠించి తరించాలన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు కె.జి.వేణు, డి.వి.సూర్యారావు, ఫణిశయన సూరి, కె.వి.ఎస్.మూర్తి, భాగవతుల సత్యనారాయణ మూర్తి, చిన సూర్యనారాయణ పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

సీతంపేట: చిరంజీవి కళాపరిషత్ ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. గాయనీ గాయకులు బిశ్వాస్, గెంబలి జగదీష్, కోసూరు రాజు, నాయుడు, కుసుమ, గౌరి, స్వర్ణ, లక్ష్మీప్రియ సినీ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు జి.జగదీష్, కళా సంస్థల ప్రతినిధులు చెన్నా తిరుమలరావు, సస్ మూర్తి, ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు.

సోలార్ ఉత్పత్తుల పంపిణీ



కాలనీవాసులకు సోలార్ లైట్లు, ఫ్యాన్లు అందజేస్తున్న కె.కె.రాజు, కంపా హనోకు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి ఏఎస్సార్ నగర్(చెంచుల కాలనీ) వాసులకు శారదా వ్యాలీ డెవలప్‌మెంట్ సమితి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సోలార్ లైట్లు, ఫ్యాన్లు పంపిణీ చేశారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్, కంపా హనోకుల చేతుల మీదుగా వాటిని అందజేశారు. హాబిటాట్ ఫర్ హ్యూమనిటీ ఇండియా, ఆప్టిమస్ సంస్థల సహకారంతో ఈ ప్రాంతంలోని సుమారు 48 కుటుంబాలకు ఉచితంగా సోలార్ లైట్లు, ఫ్యాన్లు అందించినట్లు ఎస్‌వీడీఎస్ పీఆర్వో చైతన్య తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పాపునాయుడు, ఎస్‌వీడీఎస్ ప్రతినిధులు రవి భాస్కర్, స్థానికులు సతీష్, రవి, నారాయణ, యాకోబు, బక్కయ్య, రాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'మాల్-ఖానా' ఏర్పాటు



కంచరపాలెం పోలీస్ స్టేషన్ టెర్రస్‌పై బ్లాక్‌లను పరిశీలిస్తున్న సీఐ విజయ్‌కుమార్

మర్రిపాలెం: నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో 'మాల్-ఖానా' ఏర్పాటు చేస్తున్నట్టు సీఐ ఎస్.విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం స్టేషన్ టెర్రస్‌పై ఈ బ్లాక్‌లను ఏర్పాటు చేశామన్నారు. పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఈ కోడ్‌ను తయారు చేసినట్టు చెప్పారు. కేసులు నమోదైన తర్వాత సంబంధిత వస్తువులను కోర్టులో ప్రవేశపెట్టడానికి వాటిని పోలీసులు స్వాధీనం చేసుకుంటారన్నారు. నేరాలను బట్టి నిందితుల ఉపయోగించిన పరికరాలను జాగ్రత్తగా కోర్టులో ప్రవేశపెట్టడానికి ఉపయోగపడేలా మాల్ ఖానా తయారు చేస్తున్నట్టు తెలిపారు. దీని ద్వారా ఎప్పుడు ఏ నేరం ఎలా జరిగింది, అంతేకాక కోర్టులో ప్రవేశపెట్టడానికి సులభతరంగా ఉంటుందన్నారు. ఎన్ని ఏళ్లు గడిచినా, ఎంతమంది సిబ్బంది మారినా.. మాల్-ఖానా ద్వారా రికవరీ ప్రాపర్టీ ఎక్కడో తెలుసుకునేందుకు వీలుగా ఉంటుందని సీఐ వివరించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

గోపాలపట్నం: మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెంకటాపురం గొల్ల వీధిలో జరిగింది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీవీఎంసీ 92వ వార్డు గొల్ల వీధికి చెందిన ఉరుకూటి ఈశ్వరరావు(32) రాడ్ బెండింగ్ పని చేసేవాడు. అతడికి తల్లిదండ్రులు, భార్య, రెండు నెలల బాబు ఉన్నాడు. భార్య ప్రసవం నిమిత్తం అక్కయ్యపాలెంలోని పుట్టింటికి వెళ్లింది. బుధవారం సాయంత్రం ఈశ్వరరావు తల్లిదండ్రులు బయటకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటి శ్లాబ్ హుక్‌కి ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. అయితే ఇటీవల ఈశ్వరరావు భార్యకు అనారోగ్యంతో కొడుకు పుట్టాడని, దీంతో మనస్తాపానికి గురయ్యాడని స్థానికులు చెబుతున్నారు. మృతుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

టేబుల్ టెన్నిస్‌లో జాతీయ స్థాయిలో ప్రతిభ



అకాడమీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులతో అతిథులు, శిక్షకులు

సీతంపేట: అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లోని ఎంఆర్ఎస్‌పీటీటీఏ టేబుల్ టెన్నిస్ అకాడమీ పంచమ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. అకాడమీ వ్యవస్థాపకుడు కె.శ్రీకృష్ణమూర్తి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా టేబుల్ టెన్నిస్ కార్యదర్శి డి.వి.ఎస్.వై.శర్మ ముఖ్య అతిథిగా మాట్లాడారు. అకాడమీలోని ఆటగాళ్లు విశాఖ జిల్లాకు గర్వకారణమని, వారి ప్రతిభను మెచ్చుకున్నారు. అకాడమీ వ్యవస్థాపకుడు మూర్తి మాట్లాడుతూ సంస్థ స్థాపించిన ఐదేళ్లలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో 30 మంది క్రీడాకారులు పాల్గొని విజేతలుగా నిలిచి ప్రతిభ చాటారన్నారు. అండర్-11 జాతీయ స్థాయిలో 10వ స్థానంలో నిలిచిన వి.హార్థిక్ రామ్ అకాడమీకి గర్వకారణమన్నారు. 20 మంది క్రీడాకారులు వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను అతిథుల చేతుల మీదుగా సత్కరించారు. కొణతాల రేవతీరావు, కె.మురళీపాత్రో, ప్రధాన శిక్షకులు టి.శ్రీకాంత్ రాజు, కె.ఉదయ్ భాను, ఎం.రవికుమార్, వై.రోహిత్ పాల్గొన్నారు.

ఘంటసాల నాటకం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్ వెంకటకుమారి, బాదంగీర్ సాయి తదితరులు

అల్లిపురం: గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వర రావు జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన నాటకం పోస్టర్‌ను నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఆవిష్కరించారు. మేయర్ ఛాంబర్‌లో బుధవారం ఆమెను రంగసాయి గ్రంథాలయ వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి, సీనియర్ జర్నలిస్ట్ ఎస్.నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె రంగసాయి నాటక గ్రంథాలయం శాశ్వత నిధుల సమీకరణకు నిర్వహిస్తున్న ఘంటసాల నాటకం ప్రతి ఒక్కరూ చూడాలని పిలుపునిచ్చారు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో రెండు ప్రదర్శనలుగా ఈ నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు బాదంగీర్‌సాయి తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన శ్రీ సాయి సంతోషి నాట్యమండలి, సురభి కళాకారులు ఈ నాటకాన్ని ప్రదర్శిస్తున్నారని తెలిపారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా నాటక గ్రంథాలయాన్ని విశాఖలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాటక గ్రంథాలయ పాలకులు జమ్మా చిన్నబాబు పాల్గొన్నారు.

డీఆర్ఎం దృష్టికి రాయగడ సమస్యలు



డీఆర్ఎం అనూప్‌కుమార్‌ను కలిసిన రాయగడ నాగరిక మంచ్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: రాయగడ నాగరిక మంచ్ ప్రతినిధి బాదల్‌కుమార్ తహ నాయకత్వంలో బుధవారం డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతిని దొండపర్తిలోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా రాయగడ ప్రాంతంలోని వివిధ సమస్యలను ఆయనకు వివరించారు. రాయగడ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల విషయంలో డీఆర్ఎం చేస్తున్న కృషిని వారు అభినందించారు. ఈ సమస్యలపై డీఆర్ఎం సానుకూలంగా స్పందించినట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ ఆలయంలో బుధవారం అమ్మవారికి భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం నిర్వహించారు. ముందుగా ఆలయ ఈవో రామాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ అమ్మవారిని పూజించారు. ఉదయం గణపతి పూజ, అమ్మవారికి భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు చేశారు. పంచామృతాభిషేకం అనంతరం విశేష పూజలు జరిపారు. సాయంత్రం అమ్మవారిని పసుపుతో అలంకరించి, హారతులిచ్చారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.